www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 23 అక్టోబర్ 2024
5
ఏలూరు

25న జంగారెడ్డిగూడెంలో జాబ్‌మేళా

జంగారెడ్డిగూడెం :రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెంలోని శ్రీ రామచంద్ర డిగ్రీ కళాశాలలో ఈ నెల 25న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జి వాడపల్లి కిషోర్ తెలిపారు. ఈ జాబ్‌ఫెయిర్‌లో ముత్తూట్ ఫైనాన్స్, హెటిరో ల్యాబ్స్ డేటా బ్లోస్జ్, రామచంద్ర గ్రూప్స్ ఆఫ్ ఇన్సటిషన్స్, లగ్జరీ ల్యాండ్ లార్డ్ యూనివర్సల్ ప్రాజెక్ట్, ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, సుమారు 260 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తారని తెలిపారు. ఈ జాబ్‌మేళాకు పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, పీజీ వంటి విద్యార్హతలు ఉండి 18–30 సంవత్సరాల మధ్య వయస్సు గల వారు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు 9182342688, 9652503799 నెంబర్లకు ఫోన్ చేయాలని, జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ బయోడేటా సర్టిఫికెట్స్ నకళ్లతో హాజరు కావాలని కోరారు.

జిల్లా అభివృద్ధికి సమిష్టి కృషి

ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్



ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి పార్థసారథి, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు

ప్రతిఒక్కరూ గర్వపడేలా జిల్లా అభివృద్ధికి కలిసికట్టుగా పని చేద్దామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మంగళవారం ఆయన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా తొలిసారి కలెక్టరేట్‌కు విచ్చేసిన సందర్భంగా జిల్లాకు చెందిన ఎంఎల్ఎలు, అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ ఒకే భావన, ఆలోచనలతో కలిసి సమిష్టిగా పని చేసి, ప్రజలకు మరింత మెరుగైన సేవలందిద్దామన్నారు. ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా దృష్టి పెట్టాలన్నారు. ఎంపీలు, జెడ్‌పి ఛైర్‌పర్సన్, ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలకు ప్రజలు అందించే ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మంత్రిని కలిసి వారిలో కలెక్టర్ వెట్రిసెల్వి, జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్, ఎంఎల్‌లు బడేటి రాధాకృష్ణయ్య, పత్సమట్ల ధర్మరాజు, సొంగా రోషన్‌కుమార్, చిర్రి బాలరాజు, మద్దిపాటి వెంకటరాజు, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తదితరులు ఉన్నారు.

జిల్లా అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

దీపావళి తర్వాత జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాల కోసం ప్రత్యేక ప్రణాళిక రూపకల్పన చేస్తామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆయన కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ఆయిల్‌పామ్, కోకో పంటలకు అనుకూలమైన వాతావరణం ఉందని, వాటిని మరింత ప్రోత్సహిస్తామని చెప్పారు. ప్రజల్లో విశ్వాసం కలిగేలా ముఖ్యమంత్రి పాలనా దక్షతతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. ప్రజలు కోరుకునేలా పాలన చేస్తున్నామన్నారు. పోలవరం నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా జిల్లా యంత్రాంగం తరపున తమవంతు సహకారం అందిస్తామన్నారు. ఏలూరు జిల్లా అద్భుత వనరులు కలిగిన జిల్లా అని, వనరులను వినియోగించుకుని జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలుపుతామన్నారు. సంక్షేమం విషయంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఫలాలు అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతి నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు ప్రత్యేక క్లస్టర్లు ఏర్పాటు చేస్తామన్నారు. వరదలు, వర్షాల కారణంగా పంటల నష్ట నివారణకు ఒక ప్రణాళిక రూపొందించనున్నామని, జిల్లా అభివృద్ధికి చాలా ఆలోచనలు ఉన్నాయని, ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తామని అన్నారు. ఉచిత ఇసుక విధానంలో ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉందని, ఇందులో ఎలాంటి అవినీతి సహించేది లేదని మంత్రి స్పష్టం చేశారు. మహిళలపై అరాచకాలను సహించేది లేదని, అటువంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల నిర్మూలనపై యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో శాసనసభ స్పీకర్‌గా మనోహర్ వ్యవహరించారని, ఏ పదవి అలంకరించినా అందుకు వన్నె తెచ్చిన వ్యక్తి నాదెండ్ల మనోహర్ అని అన్నారు. ఇన్‌ఛార్జి మంత్రి, ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో జిల్లాను అభివృద్ధి చేస్తామన్నారు.

అంబరుపేట పరిసరాల్లో చిరుత!

ఆందోళనలో జనం

రక్షణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అటవీ శాఖాధికారులు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు పరిసర ప్రాంతాల్లో సంచలనం రేకెత్తిస్తున్న చిరుత పులి సంచారం పరిధి మంగళవారం మరింత పెరిగినట్లుగా అటవీ శాఖ అధికారులు గుర్తించారు. తొలుత చిరుత పులి సంచారం గమనించిన అందాలమ్మ సాగునీటి చెరువు ప్రాంతంలో పులిజాడ కనుక్కునేందుకు ట్రాప్ కెమెరాలు, పట్టుకునేందుకు బోనులు ఏర్పాటు చేశారు. సోమవారం చిరుత పులి ఆ ప్రాంతాల్లో సంచరించినట్లు కెమెరాల్లో నమోదైంది. మంగళవారం ఆ ప్రాంతంలో చిరుత సంచారం గురించి కెమెరాల్లో నమోదు కాలేదు. అయితే అటవీ శాఖాధికారుల బృందం మంగళవారం భీమడోలుకు సమీప ప్రాంతంలోని అంబరుపేట రెవెన్యూ పరిధిలో గల వసంత కాలనీ వద్ద చెరకు సాగు వ్యవసాయ క్షేత్రాల వద్ద చిరుత పులి పాదముద్రలను గుర్తించారు. రైతులను చెరకు తోటలోకి వెళ్లొద్దని సూచించారు. తాజాగా ఆ ప్రాంతంలో చిరుత పులి పాదముద్రలు కనిపించడంతో అక్కడ సైతం ట్రాప్ కెమెరాలు, పట్టుకునేందుకు అదనపు బోనులు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

పెండింగ్ అర్జీలను త్వరగా పరిష్కరించాలి

తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్‌డిఒ వాణి

రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌డిఒ వాణి

ప్రజాశక్తి - ముసునూరు

పెండింగ్ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నూజివీడు ఆర్‌డిఒ ఎం.వాణి చెప్పారు. మండల కేంద్రమైన ముసునూరు తహశీల్దార్ కార్యాలయాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. తహశీల్దార్ జిపి.శర్మ ఆధ్వర్యంలో రికార్డులను పరిశీలించారు. పెండింగ్ ఉన్న దరఖాస్తులకు గల కారణాలను ఆర్ఐ అరవపల్లి దీపిక, విఆర్‌ఒలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని 16 గ్రామాల్లో 83 పాస్ పుస్తకాలు, 28 సర్వే అప్లికేషన్లు, రెండు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటికి సంబంధించిన కారణాలన్నింటిని అడిగి తెలుసుకుని మళ్లీ వారం రోజుల్లో వచ్చి సమస్యలన్నింటిని పరిష్కరించే విధంగా చర్యలు చేపడతానని తెలిపారు.

ధాన్యం తోలిన 48 గంటల్లో సొమ్ము

చేబ్రోలులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి నాదెండ్ల మనోహర్



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మనోహర్

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఖరీఫ్‌లో ధాన్యం తోలిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో సొమ్ము జమయ్యేలా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మండలంలోని చేబ్రోలులో రైతుసేవా కేంద్రం-1 వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులను ఆదుకోవాల్సిందిపోయి రూ.1659 కోట్లు బకాయిలు వదిలేసి వెళ్లిపోయినా ముఖ్యమంత్రి చం ద్రబాబు, మంత్రి పవన్‌కళ్యాణ్ చర్చించుకుని పెండింగ్ బకాయిలను రైతులకు చెల్లించి ఆదుకున్నామన్నారు. వెల్లమిల్లికి చెందిన బండి శివరామకృష్ణకు చెందిన 120 మెట్రిక్ టన్నుల పిఆర్ 126 రకం ధాన్యాన్ని తొలివిడతగా సేకరించారు. నాచుగుంట గాయత్రి రైస్‌మిల్లుకు వెళ్లే ధాన్యం ట్రాక్టరుకు ఎంఎల్ఎ ధర్మరాజు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, జెసి ధాత్రిరెడ్డి, వ్యవసాయ శాఖ జెడి హబీబ్‌భాషా, ఉంగుటూరు, దెందులూరు, తాడేపల్లిగూడెం ఎంఎల్ఎలు పత్సమట్ల ధర్మరాజు, చింతమనేని ప్రభాకర్, బొలిశెట్టి శ్రీనివాసరావు, టిడిపి జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీ రాణి, ఉంగుటూరు ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, భీమడోలు ఎడిఎ ఉషారాజకుమారి, ఎఒ ప్రవీణ్‌కుమార్ ఎంపిటిసి సభ్యులు రాయి లక్ష్మి, మనసాల నాగమణి, అధికారులు పాల్గొన్నారు.

మినీకిట్ మినుముల కోసం వాగ్వివాదం.. రైతుల మధ్య తోపులాట

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా 40 కేజీలు మినుములతో మినీకిట్స్ వచ్చాయి. ఒక్కో బ్యాగ్ 4 కేజీలు ఉంటుంది. 10 మంది రైతులను గుర్తించి మంత్రి చేతుల మీదుగా వాటిని పంపిణీ చేసేందుకు వ్యవసాయాధికారులు సన్నాహాలు చేశారు. అయితే చేబ్రోలులో టిడిపి అనుచర రైతుల పేర్లే గుర్తించారని, జనసేనకు చెందిన రైతుల పేర్లు ఎందుకు గుర్తించలేదంటూ అదే గ్రామానికి చెందిన రైతులు అధికారులను రైతుసేవా కేంద్రం వద్ద ప్రశ్నించారు. రైతులను అధికారులు సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది. అయితే అనంతరం రైతుసేవా కేంద్రం బయటకు వచ్చిన ఇరు పార్టీలకు చెందిన రైతుల మధ్య మాటల తూటాలు రేగాయి. దీంతో తోపులాట జరిగింది. పోలీసులు వచ్చి సర్దిచెప్పడంతో ఇరువురు శాంతించారు. కూటమి నాయకుల మధ్య ఎలాంటి గొడవలూ లేవని నాయకులు వెల్లడించారు.

బాలుర వసతి గృహం తనిఖీ

ప్రభుత్వ వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న జడ్జి లక్ష్మి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ వివిఎన్‌వి.లక్ష్మి మంగళవారం ముదినేపల్లిలోని ప్రభుత్వ కళాశాల బాలికల వసతి గృహాన్ని, బిసి బాలుర వసతి గృహాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు గ్రోసెరీస్, ఆహారం, బెడ్స్, వాటర్ సౌకర్యాలు ఎలా ఉన్నాయని పరిశీలించారు. అనంతరం విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. రెండు హాస్టళ్ల వార్డెన్ల పనితీరు పట్ల జడ్జి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పానల్ అడ్వకేట్స్ పి.ప్రసన్నకుమార్, ముదినేపల్లి ఎఎస్ఐ పద్మజ, బిసి బాలుర వసతి గృహం వార్డెన్ పి.సురేష్‌బాబు, కళాశాల బాలికల హాస్టల్ వార్డెన్ అనంతకుమారి, మహిళా పోలీస్ విజయ్‌కుమారి పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు షురూ

నవంబర్ 24 నుంచి 29వ తేదీ వరకు ఎన్నికల నిర్వహణ



ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి 40 రోజుల కార్యాచరణ ప్రణాళిక ప్రకారం షెడ్యూల్ విడుదలైందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. 356 నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్-1ను సోమవారం విడుదలైందని పేర్కొన్నారు. సదరు ప్రక్రియ విషయమై ఓటర్ జాబితా సిద్ధం చేయడానికి ప్రతి మండలానికీ నీటి వినియోగదారుల సంఘం పరిధిలో సంబంధిత తహశీల్దారును ఆథరైజ్డ్ అధికారిగానూ, ఆయకట్టు వివరాలు సరిచూసేందుకు సంబంధిత నీటి పారుదల శాఖ తరపున ఎఇని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ నెల 22 నుండి 31వ తేదీ వరకు జలవనరుల శాఖ అధీకృత అధికారి ద్వారా ప్రాదేశిక నియోజకవర్గాలవారీగా జాబితా సిద్ధం చేసి ఈ నెల 31న ప్రాదేశిక నియోజకవర్గాలను ప్రకటిస్తారని తెలిపారు. నవంబర్ 1, 2 తేదీల్లో అభ్యంతరాల ప్రకటన, 3వ తేదీన అభ్యంతరాలు పరిష్కారం, అనంతరం అదే రోజు ప్రాదేశిక నియోజకవర్గాల తుది జాబితా ప్రకటన చేస్తారన్నారు.

3న నీటి పంపిణీ సంఘాలకు ప్రాజెక్ట్ కమిటీ నోటిఫికేషన్

నవంబర్ 3న నీటి పంపిణీ సంఘాలకు, ప్రాజెక్ట్ కమిటీలకు నోటిఫికేషన్ విడుదల చేస్తామని కలెక్టర్ తెలిపారు. నవంబర్ 6 నుండి 10వ తేదీ వరకు భూయజమానుల జాబితా, ఓటర్ల జాబితాను ఆథరైజ్డ్ రెవెన్యూ అధికారుల ద్వారా తయారు చేస్తామన్నారు. నవంబర్ 11, 12 తేదీల్లో ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరణ, 13న అభ్యంతరాల పరిష్కారం, అదే రోజు ప్రాదేశిక నియోజకవర్గాలవారీగా తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తామని తెలిపారు. ఓటర్ల తుది జాబితాపై అభ్యంతరాలను నవంబర్ 14, 15 తేదీల్లో సంబంధిత ఆర్‌డిఒలకు సమర్పించాల్సి ఉంటుందని, 16, 17 తేదీల్లో అభ్యంతరాల పరిష్కారం ఉంటుందని చెప్పారు. ఇంకా అభ్యంతరాలు ఉంటే కడా కమిషనర్ పరిధిలో నవంబర్ 18 నుండి 20వ తేదీల మధ్య పరిష్కరిస్తారని తెలిపారు. నవంబర్ 20న నీటి వినియోగదారుల సంఘాలకు, నీటి పంపిణీ కమిటీలకు, ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తామని, నవంబరు 21 నుండి 23వ తేదీల మధ్య అన్ని నీటి వినియోగదారుల సంఘాల్లోని సభ్యులు అధ్యక్ష ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారని చెప్పారు. నవంబర్ 24 నుండి 26వ తేదీల మధ్య నీటి పంపిణీ సంఘాలకు, నవంబర్ 27 నుండి 29వ తేదీల మధ్య ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు జరుగుతాయని జిల్లా కలెక్టర్ తెలిపారు.నవంబర్ 24 నుంచి 29వ తేదీ వరకు ఎన్నికల నిర్వహణ

కానిస్టేబుల్ నాగబాబుకు అవార్డు

పలువురి అభినందన

అవార్డు అందుకుంటున్న నాగబాబు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బత్తిన నాగబాబు ఉత్తమ పోలీస్ అవార్డు అందుకున్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఏలూరులో జరిగిన సంస్మరణ దినోత్సవంలో కలెక్టర్ వెట్రిసెల్వి, డిఐజి అశోక్ కుమార్, ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ చేతుల మీదుగా బెస్ట్ ఫరార్మెన్స్ ఆఫ్ ది డే అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా నాగబాబును జెసి ధాత్రిరెడ్డి, ఎఎస్‌పి సూర్య చంద్రరావు, డిఎస్‌పి శ్రావణ్ కుమార్, కైకలూరు సిఐ రవికుమార్, ముదినేపల్లి ఎస్ఐ విఎస్.వీరభద్రరావు, ముదినేపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది అభినందించారు.

క్లాప్ డ్రైవర్లకు బకాయిలు చెల్లించాలి

లేకపోతే 4 నుంచి నిరవధిక సమ్మె చేపడతాం

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సోమయ్య

మున్సిపల్ వెహికల్ డిపో వద్ద ధర్నా చేస్తున్న డ్రైవర్లు, నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

క్లాప్ ఆటోల డ్రైవర్లకు బకాయి ఉన్న మూడు నెలల జీతాలు వెంటనే చెల్లించాలని, జనవరి నుంచి బకాయి ఉన్న పిఎఫ్, ఇఎస్ఐలు ఖాతాలో జమ చేయాలని కోరుతూ మంగళవారం ఏలూరు నగరపాలక సంస్థ క్లాప్ ఆటోల డ్రైవర్లు స్థానిక వంగాయగూడెం సెంటర్‌లో ఉన్న మున్సిపల్ వెహికల్ డిపో వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ నగర పరిశుభ్రతకు, చెత్త సేకరణకు ఎంతో శ్రమ పడుతున్న క్లాప్ ఆటోల డ్రైవర్లు గత మూడు మాసాలుగా జీతాలు లేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఇంటి అద్దెలు, పిల్లల స్కూల్ ఫీజులు కట్టుకోలేకపోతున్నారని, పచారి సరుకులు కొనుక్కోలేకపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం, అధికారులు క్లాప్ ఆటోల డ్రైవర్ల బకాయి జీతాలు చెల్లించడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. తక్షణమే క్లాప్ ఆటోల డ్రైవర్ల మూడు నెలల బకాయి జీతాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే నవంబర్ నాలుగో తేదీ నుంచి చెత్త సేకరణ నిలుపుదల చేసి నిరవధిక సమ్మె చేపడతామని, దానికి ప్రభుత్వం, అధికారులే బాధ్యత వహించాలని తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జానుబాబు మాట్లాడారు. అధ్యక్ష, కార్యదర్శులు రాజు, గణేష్‌లు డ్రైవర్లు జీతాలు లేక పడుతున్న ఆవేదనను తెలిపారు. ఈ కార్యక్రమానికి రాజు, పుష్పరాజు, గణేష్, హరిష్, సుగుణరావు విజయ్, దుర్గారావు తదితరులు నాయకత్వం వహించారు. ధర్నా అనంతరం మున్సిపల్ అడిషనల్ కమిషనర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.

టీచర్స్ ఎంఎల్‌సిగా గోపీమూర్తి గెలుపు బాధ్యత మీదే

ఉపాధ్యాయులతో పట్టభద్రుల ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - యలమంచిలి

ఉపాధ్యాయ ఎంఎల్‌సి స్థానానికి పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొర్రా గోపీమూర్తిని గెలిపించుకునే బాధ్యత ఉపాధ్యాయులదేనని ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం కొంతేరు, కాజా, ఏనుగువానిలంక, చించినాడ, యలమంచిలి, మేడపాడు, శిరగాలపల్లి, ఇలపకుర్రు, మట్లపాలెం, గుంపర్రు, దొడ్డిపట్ల జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో టీచర్లతో సమావేశమయ్యారు. కొంతేరులో ఎస్ఆర్.శంకరన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు అనంతరం స్టాఫ్ మీటింగ్లో మాట్లాడటంతోపాటు ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. దీంతోపాటు పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షలకు ఏవిధంగా సన్నద్ధం కావాలో సూచించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పోలిశెట్టి క్రాంతికుమార్, మండల అధ్యక్షులు గుత్తిందీవి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పంతం రామ్మూర్తినాయుడు, ప్రజా సంఘాల బాధ్యులు యర్రా అజయ్‌కుమార్, డి.సుధాకర్, పూర్వపు రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సరిపల్లి జయప్రభ, గుమ్మాపు ప్రభాకర్, ఎస్ఎస్.అవధాని, పొత్తూరి నరసింహారాజు, కానేటి బాలరాజు, జి.రామాంజనేయులు పాల్గొన్నారు.

మొగల్తూరు: ఉపాధ్యాయుల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని కషి చేస్తానని యుటిఎఫ్ బలపర్చిన పిడిఎఫ్ టీచర్స్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపీమూర్తి అన్నారు. మంగళవారం మొగల్తూరు మండలంలోని జెడ్‌పి హైస్కూళ్లను ఆయన సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. తన విజయానికి సహకరించాలని ఆయన కోరారు. ఆయన వెంట యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయరామరాజు, మండల అధ్యక్షులు చింతపల్లి కృష్ణమోహన్, జిల్లా మహిళా కార్యదర్శి పి.కృష్ణకుమారి, మండల కోశాధికారి కొల్లాటి బ్రహ్మయ్య, మండల సహాధ్యక్షులు అంగర మురళీధర్ తదితరులు ఉన్నారు.

బకాయిలు చెల్లించాలని కార్మికుల నిరసన

భీమడోలులో...

ప్రజాశక్తి - భీమడోలు

పొరుగు సేవల ప్రాతిపదికన ప్రభుత్వ వైద్యశాలల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు వేతన, పిఎఫ్, ఇతర బకాయిలు చెల్లించాలని కోరుతూ కార్మికులు భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. యూనియన్ నాయకులు, ఆరోగ్య కేంద్ర పారిశుధ్య కార్మికుల పర్యవేక్షకులు ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. పారిశుధ్య కార్మికులు వెంకటేశ్వరమ్మ, పైడమ్మ, జ్యోతి, పద్మారాణి, పుష్ప ప్ల కార్డులతో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ఎపి మెడికల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో తమ సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. సమస్యలు పరిష్కారం కాకుంటే యూనియన్ పిలుపుమేరకు ఈ నెల 31వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లనున్నామన్నారు. ఈ క్రమంలో ఈ నెల 20వ తేదీ నుంచి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

చింతలపూడి : పెండింగ్ వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐలను చెల్లించాలని కోరుతూ ప్రభుత్వాసుపత్రిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు చేపట్టిన నిరసన మంగళవారంతో మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు రావాల్సిన ఐదు నెలల పెండింగ్ జీతాలు, పెండింగ్ ఇఎఫ్, ఇఎస్ఐలను విడుదల చేయాలని, కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దుచేసి, పర్మినెంట్ చేయాలని కోరారు. గంట సేపు నిరసన తెలిపి నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తోర్లపాటి బాబు, ది మెడికల్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, ఎఐటియుసి అనుబంధం చింతలపూడి శాఖ అధ్యక్షురాలు తుర్లపాటి మరియమ్మ, తిరుమల శెట్టి రాము, కూరపాటి నాగరాజు, కోడిగంటి శ్రీనివాసరాజు, పింగుల రాజకుమారి, మానేపల్లి సుజాత, గొర్రె దేవమణి, బుద్ధవరపు వెంకట్రావు పాల్గొన్నారు.

చింతలపూడిలో...

లిక్కర్ పరిశ్రమలో సిఐడి తనిఖీలు

చేబ్రోలులో లిక్కర్ పరిశ్రమ కార్యాలయం

ప్రజాశక్తి - ఉంగుటూరు

రాష్ట్రవ్యాప్తంగా మద్యం తయారీ డిస్టిలరీలు, బెవరేజెస్‌పై ఏకకాలంలో ఎపి సిఐడి బృందాల సోదాల్లో భాగంగా మండలంలోని చేబ్రోలులో మంగళవారం సోరింగ్ స్పిరిట్స్ ప్రయివేట్ లిమిటెడ్ లిక్కర్ పరిశ్రమలో రాజమహేంద్రవరం సిఐడి అదనపు ఎస్‌పి ఆస్మాన్ ఫరహీన్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. సిఐడి తనిఖీల్లో కీలకమైన కొన్ని పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. గత ఎన్నికల సమయంలో మద్యం తయారీ కంపెనీల సామర్థ్యం ఎంత, ఎంత తయారుచేశారు, ఎవరెవరికి పంపారనే విషయాలను కూలంకషంగా పరిశీలించారు.

25న నూజివీడులో జాబ్‌మేళా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో నూజివీడు ప్రభుత్వ ఐటిఐలో ఈ నెల 25వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఇన్‌ఛార్జ్ వాడపల్లి కిషోర్ తెలిపారు. ఈ జాబ్‌మేళాలో నవత రోడ్ ట్రాన్స్‌పోర్ట్, వరుణ్ మోటార్స్, మెడ్ ప్లస్ ఫార్మసీ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. సుమారు 130 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఈ జాబ్‌మేళాకు పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, పీజీ, వంటి విద్యార్హతలు ఉండి 18 నుంచి 30 ఏళ్ల వయసు గలవారు అర్హులని తెలిపారు. ఈ జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్స్ నకలుతో హాజరు కావాలని తెలిపారు.

రీ సర్వేపై భూ సదస్సు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని మంగపతిదేవిపేట గ్రామపంచాయతీ వద్ద జగనన్న రీ సర్వేలో జరిగిన హెచ్చుతగ్గులను సరి చేసేందుకు భూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు పాల్గొని జాయింట్ ఎల్‌పి నెంబర్లు, డీనోవెషన్ పట్టా భూములు, గతంలో ఉన్న భూ సమస్యల గురించి తహశీల్దార్‌కు వివరించారు.

రోడ్లు అభివృద్ధి చేయాలని వినతి

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని రేచర్లలో ఉన్న స్థానిక రోడ్లను అభివృద్ధి చేయాలని, రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీతో కూడిన సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని సిపిఐ మండల కమిటీ సభ్యులు కృష్ణ కోరారు. ఈ మేరకు స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ కార్యదర్శి కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, అభివృద్ధి చేయాలని కోరారు. ఈ వినతిపత్రం ఇచ్చిన వారిలో శాఖ కార్యదర్శి వెంకటేశ్వరరావు, పూల దాసు వెంకయ్య, తదితరులు ఉన్నారు.

పదవులు ఎవరికీ శాశ్వతం కాదు

ప్రజాశక్తి - ముదినేపల్లి

పదవులు ఎవరికీ శాశ్వతం కాదని, అభివృద్ధి ఎంత చేశామనేదే ముఖ్యమని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. ముదినేపల్లి మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం సాయంత్రం మండల పరిషత్ సమావేశపు హాలులో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మండలంలోని కకరవాడ గ్రామ సర్పంచ్ కాగిత రామారావు మృతి పట్ల సభలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఎంపిపి సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలోని ప్రజాప్రతినిధులు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ మండలాభివృద్ధికి పాటు పడాలని కోరారు. అధికారులు ఏ పనిలోనైనా నిర్లక్ష్యం వహించరాదన్నారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి జరిగే ఈ సమావేశానికి అధికారులందరూ రావడం సంతోషమన్నారు. అవినీతికి పాల్పడినట్లు తెలిస్తే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యవసాయ రంగంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో నాణ్యమైన విత్తనాలు ఎరువులు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఇటీవల వరద కారణంగా నీట మునిగిన పొలాల రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వై.రామకృష్ణ, ఇఒపిఆర్‌డి అశోక్, ఎఒ రమణారావు, వైస్ ఎంపిపి రావూరి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు శీలం రామకృష్ణ, అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వినికిడి మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం చెవుడు నివారణ కార్యక్రమం కింద వినికిడి సమస్య చెవుడు ఉన్న వారికి వినికిడి మిషన్లను ఉచితంగా పంపిణీ చేస్తుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.శర్మిష్ట మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దానికి సంబంధించిన వారు సరైన పత్రాలను సమర్పించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు. ఆధార్ కార్డ్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు-2, రేషన్ కార్డ్ జిరాక్స్, చెవుడు తనిఖీ సర్టిఫికెట్ పత్రాలను డిఇఐసి, ప్రభుత్వ జనరల్ హాస్పటల్ ఏలూరులో సమర్పించి తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు.

థర్మల్ పవర్‌స్టేషన్ సందర్శన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ఆర్‌జియుకెటి ఇఇఇ విభాగంలో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు సోమవారం పారిశ్రామిక సందర్శనలో భాగంగా కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్, కిన్నెరసాని ప్రాజెక్టులను సందర్శించారు. ఈ పరిశ్రమల సందర్శనలో విద్యార్థులు విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థలపై అధ్యయనం చేశారు. అలాగే ప్రాజెక్టుల నిర్వహణ పద్ధతులపై అవగాహన పొందారు. ఈ సందర్శనలో ఆర్‌జియుకెటి విద్యార్థులతో పాటు విద్యుత్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్(ఇఇఇ) శాఖ హెడ్ ఆఫ్ డిపార్టుమెంట్ శ్రావణి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు. మొత్తం వంద మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆచరణాత్మక పరిజ్ఞానాన్ని పొందారు. విద్యార్థులకు భవిష్యత్ పరిశోధన, ఉద్యోగావకాశాల గురించి అవగాహన పెంచే లక్ష్యంతో ఈ సందర్శన నిర్వహించారని శ్రావణి తెలిపారు.

'తప్పులతడకగా ఇ-క్రాప్ నమోదు'

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలో ఇ-క్రాప్ బుకింగ్ నమోదు తప్పులతడకగా ఉందని, ఇప్పటివరకు ఏ గ్రామంలో కూడా రైతు సేవ కేంద్రాల్లో, గ్రామ సచివాలయాల్లో సోషల్ ఆడిట్ కోసం బహిరంగ పరచలేదని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటాపంచల జమలయ్య అన్నారు. రైతు సంఘం, కౌలు రైతుల సంఘం ప్రతినిధులు రాయంకుల లక్ష్మణరావు, నిమ్మగడ్డ నరసింహ, చెంగల వెంకటేశ్వరరావు, కొక్కిరిపాటి ఆనంద్, పామర్తి మధు మండలంలోని వలసపల్లి, గుళ్లపూడి, గుడిపాడు గ్రామాల్లో ఇ-క్రాప్ బుకింగ్, కౌలు రైతులకు కౌలు కార్డుల పరిశీలన, పంట రుణాల మంజూరుపై మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇ పంట నమోదులో తప్పులు తడకలను సరిచేయాలన్నారు. సూపర్ సిక్స్‌లో భాగంగా రూ.20 వేలను భూమిలేని కౌలుతులందరికి అందించాలని కోరారు.

పలుచోట్ల 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని తుక్కులూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూజివీడు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు ప్రతి మంగళ, బుధవారాలలో ఉదయం ఒక గ్రామంలో గ్రామసభ నిర్వహించి సమస్యలపై చర్చాగోష్టి, మధ్యాహ్నం పొలంలోకి వెళ్లి పొలంలో పంటల పరిస్థితులపై తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, అధిక దిగుబడుల సూచనలు కులంకుశంగా రైతులతో ముఖాముఖి చర్చలు జరపడం పొలం పిలుస్తోంది కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమం వల్ల రైతులకు, నూతన వ్యవసాయ, సాంకేతిక విజ్ఞానంతో పాటు, పొలంలోని సమస్యలు, ఇతర సూచనలు ఇవ్వడంతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చటం ఎలా అనే విషయంపై అవగాహన కల్పించారు.

కలిదిండి : మండలంలోని కోరుకొల్లు రైతు భరోసా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రైతులు పండించిన పంటను నచ్చిన చోట అమ్ముకునే వెసులుబాటు, వ్యవసాయంలో నూతన పద్ధతులను అనుసరించి అధిక దిగుబడులు సాధించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని సర్పంచి బట్టు లీలా కనక దుర్గామహేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి వలవల రామారావు, వ్యవసాయ, వెటర్నరీ, మత్స్య శాఖాధికారులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

ముసునూరు :మద్యం సీసాలు కలిగి ఉన్న మహిళపై ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేసి ఆమె వద్ద నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎస్ఐ వైవిఎన్ఎస్.ఫణికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు అసిస్టెంట్ ప్రొహిబిషన్ కమిషనర్ ఎక్సైజ్, అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ వారి ఆదేశాల మేరకు ముసునూరులో మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఎక్సైజ్ ఎస్ఐ ఫణికుమార్ తన సిబ్బందితో గ్రామంలో మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో గ్రామానికి చెందిన ఓ మహిళ మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఆమె వద్ద 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ ఫణికుమార్ తెలిపారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పోలీస్ అమరవీరులను స్ఫూర్తిగా తీసుకోవాలి

జీలుగుమిల్లి : మాట్లాడుతున్న సిఐ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పోలీస్ అమరవీరులను స్ఫూర్తిగా తీసుకోవాలని సిఐ బి.వెంకటేశ్వరరావు తెలిపారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసులు ఎనలేని సేవలు చేస్తూ ప్రాణ త్యాగాలు చేస్తున్నారని వారి సేవలను కొనియాడారు. ప్రతి విద్యార్థి పోలీసు అమరవీరులను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పి.నవీన్‌కుమార్, ప్రిన్సిపల్ సతీష్, అధ్యాపకులు,స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

టి.నరసాపురం : సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణలో ఎందరో పోలీసులు అమరులయ్యారని, వారి త్యాగాలను గుర్తు చేసుకోవడమే వారికి ఇచ్చే నిజమైన నివాళి అని ఎస్ఐ ఎం.జయబాబు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా స్థానిక జెడ్‌పి హైస్కూల్‌లో పోలీసు అమరవీరుల త్యాగాలను తెలియజేస్తూ విద్యార్థులకు మంగళవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు ప్రసంగంతో పాటు కొందరు అమరులైన పోలీసుల త్యాగాలను తెలిపే వీడియోలు, బలిమెల ఘటన, మేజర్ సందీప్ ఉన్ని కృష్ణన్, నంద్యాల పిసి సురేంద్ర దారుణహత్య వీడియోలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పోలీసు విధి విధానాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సమాజ శాంతి స్థాపనకు పోలీసులు ప్రాణాలు సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బి.లింగుస్వామి, ఎఎస్ఐ వి.జయకుమార్ పాల్గొన్నారు.

ప్రజల కోసమే ఆధార్ సేవలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆధార్ సేవలు ప్రజల కోసమేనని ఎంపిడిఒ చెన్నా రాఘవేంద్రనాథ్ అన్నారు. మండలంలోని పాత రావిచెర్లలో ఆధార్ నమోదు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ సిబ్బంది ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీ, చుట్టుపక్కల గ్రామ ప్రజలు ఆధార్ కార్డులోని మార్పులు, చేర్పులను, కొత్తగా ఆధార్ కార్డులను తీసుకోవడానికి నమోదు కేంద్రాన్ని వినియోగించుకోవాలన్నారు. రానున్న రోజుల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఆధార్ అనుసంధానం జరిగే అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని చెప్పారు. ఉపాధి హామీ చట్టంలోని వేతనదారుల పని పుస్తకాన్ని తప్పనిసరిగా ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని చెప్పారు. ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత, సాంకేతికత ప్రధానాంశాలుగా ఆయన సిబ్బందికి, ప్రజలకు తెలిపారు.

కొమరం భీం జయంతి వేడుకలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఆదివాసీ గిరిజన హక్కులు కోసం పోరాడిన కొమరం భీం ఆశయాలను కొనసాగిస్తామని మండలంలోని మర్రిగూడెం పంచాయతీ గిరిజన పెద్దలు అన్నారు. కొమరం భీం జయంతి వేడుకలను మంగళవారం మర్రిగూడెంలో పంచాయతీ పెద్దలంతా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొమరం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆదివాసీ గిరిజన జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపేందుకు గిరిజన హక్కులు కాపాడేందుకు జల్ జంగిల్ జమేల్ నినాదంతో కొమరం భీం పోరాడారన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ గిరిజన పెద్దలందరూ కలిసి మర్రిగూడేన్ని మద్యం రహిత పంచాయతీగా తీర్మానించారు. పంచాయతీల్లో ఎటువంటి మద్యం షాపులు, సారా వంటి విక్రయాలు, తయారీలు చేపట్టకూడదని, ఎవరైనా విక్రయాలు చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ గిరిజన పెద్దలు పొట్టా రామారావు, కురసం నిరీక్షణరావు, కుంజా లోకేష్, పూనెం ఆదిత్య, నాగేశ్వరరావు, కుంజా వీరాస్వామి, తుట్టి నాగేశ్వరరావు, చిననాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిగా నాగేశ్వరరావు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని బొర్రంపాలెం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా నియమితులైన పగడం నాగేశ్వరరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు పనిచేసిన శ్రీనివాస్‌కృష్ణ తూర్పుగోదావరి జిల్లా దొమ్మేరు బదిలీ అయ్యారు. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన నాగేశ్వరరావు బదిలీపై ఇక్కడకు వచ్చారు. పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని నాగేశ్వరరావు చెప్పారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

టి.నరసాపురం :గ్రామీణ ప్రాంత మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయటం అభినందనీయమని కాల్నిడి శ్రీరాములు అన్నారు. బచ్చిలేటిగూడెంలో కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మహిళలకు స్వయం ఉపాధి కోసం కుట్టు శిక్షణ, పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందించటం, తాగునీటి ఎద్దడి ప్రాంతాల్లో ఉచిత తాగునీటి సరఫరా కోసం వాటర్ ట్యాంకుల ఏర్పాటు వంటివి 2008 నుంచి తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారా మాంజనేయ చౌదరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని, గ్రామంలో మూడు నెలలపాటు ఉచితంగా నిర్వహించే కుట్టు శిక్షణ శిబిరాన్ని ప్రతి ఒక్క మహిళ వినియోగించుకోవాలని తపన ఫౌండేషన్ ప్రతినిధి గణేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జట్ల రాంబాబు, వేగేశ్న సత్రం రాజు, కురుసం రామచంద్రరావు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతులు కల్పించాలి

ఏలూరు అర్బన్ :మెరిట్ ఆధారంగా, ఆర్ఒఆర్ ప్రకారం సీనియారిటీని ప్రాతిపదికగా తీసుకుని ఆరోగ్య కార్యదర్శులకు ఉద్యోగోన్నతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని, ఈ విషయంపై డిఎంహెచ్ఒ దృష్టికి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం జరిగేలా చూస్తామని ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు సచివాలయ ఆరోగ్య కార్యదర్శులకు హామీ ఇచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సచివాలయంలో పనిచేస్తున్న గ్రామ ఆరోగ్య కార్యదర్శులు ఎన్‌జిఒ నాయకులతో మంగళవారం సమావేశమయ్యారు. డిఎంహెచ్ఒను జిల్లా ఎన్‌జిఒస్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావులు కలిసి అర్హులకు విధి విధానాలననుసరించి, రోస్టర్ ప్రకారం, మెరిట్ ప్రాతిపదికన ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు.

డ్రెయినేజీ నిర్మాణంలో నాణ్యత లోపం

రేపల్లెవాడ వాసుల ఆందోళన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

నిర్మాణమవుతున్న డ్రెయినేజీ | నాణ్యత లేని ఇసుక

మండలంలోని రేపల్లెవాడ గ్రామంలో డ్రెయినేజీ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిషత్ నిధులు సుమారు రూ.ఐదు లక్షలతో చేపట్టిన ఈ డ్రెయినేజీ నిర్మాణం 155 మీటర్ల పొడవు, ఐదు అడుగుల వెడల్పుతో ఇరువైపులా కాంక్రీట్ గోడలతో నిర్మించాల్సి ఉంది. నిర్మాణంలో ఉపయోగిస్తున్న సిమెంట్ నాణ్యత లేకుండా ఉండటం, మట్టి కలిసిన ఇసుకను వినియోగిస్తున్నారని చెబుతున్నారు. దాదాపు రెండు దశాబ్దాలుగా డ్రెయినేజీ కోసం ఎదురుచూస్తున్న తమకు నాణ్యతలేని డ్రెయినేజీ నిర్మించడం దారుణమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ పర్యవేక్షణలో ఈ నిర్మాణం జరుగుతుండగా సంబంధిత అధికారులు స్పందించి నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజా సమస్యలపై పోరు ఉధృతం

సిపిఎం నాయకులు పి.రామకృష్ణ

ప్రజాశక్తి - ముసునూరు

ప్రజా సమస్యలపై పోరాడితేనే పార్టీ మనుగడ, అభివృద్ధి సాధ్యమవుతుందని సిపిఎం జిల్లా నాయకులు పి.రామకృష్ణ అన్నారు. మండలంలోని చింతలవల్లి ప్రజాసంఘాల కార్యాలయంలో సిపిఎం మండల మహాసభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సిపిఎంను బలోపేతం చేయడానికి పార్టీ మండల కమిటీ సభ్యులందరూ ఐక్యంగా కృషి చేయాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు మాట్లాడుతూ మండలంలో గత మూడేళ్ల క్రితం 24 మంది సభ్యులతో కూడిన పార్టీ నేడు 34 మందితో అభివృద్ధి చెందిందన్నారు. మండలంలో చింతలపూడి ఎత్తిపోతల పథకం, వ్యవసాయ రైతుల సమస్యలు, ఇళ్ల స్థలాలు, డ్రెయినేజీ, ఇంటి నిర్మాణ సమస్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కమిటీ సభ్యులు పిల్లి మురళి, కొడవలి శ్రీను, సిహెచ్.శ్రీను, చల్లపల్లి శ్రీను, కంచర్ల రమేష్ పాల్గొన్నారు.

జ్వరాన్ని అశ్రద్ధ చేయొద్దు

అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జ్వరం వస్తే ప్రజలు ఎవరూ అశ్రద్ధ చేయవద్దని, వెంటనే వైద్యులను సంప్రదించాలని, జ్వరాలను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు ఉంటుందని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శర్మిష్ట సూచన మేరకు ఆమదాల అప్పలస్వామి కాలనీలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. అక్కడ వైద్యాధికారి డాక్టర్ నవ్య ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులతో మాట్లాడుతూ సాధారణంగా వర్షాకాలంలో మనకు ఎక్కువగా అనారోగ్య సమస్యలు సంక్రమిస్తాయన్నారు. ముఖ్యంగా జ్వరాలు, టైఫాయిడ్, మలేరియా, చికెన్‌గున్యా, డెంగి తదితర వ్యాధులతో బాధపడే అవకాశం ఎక్కువగా ఉంటుందని చెప్పారు.

ప్రత్యేక డిఎస్‌సిని ప్రకటించాలి

ఏజెన్సీ నిరుద్యోగ యువత ఆందోళన

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

ఆందోళన చేస్తున్న నిరుద్యోగ యువకులు

ప్రత్యేక డిఎస్‌సిని ప్రకటించాలని, జిఒ-3ని పునరుద్ధరించాలని గిరిజన నిరుద్యోగ యువత కోరారు. ఈ మేరకు వేలేరుపాడు మండలానికి నిరుద్యోగ యువత ప్లకార్డులతో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక డిఎస్‌సి, జిఒ-3 పునరుద్ధరణ సాధన కోసం ఏజెన్సీలోని నిరుద్యోగ యువత బుట్టాయగూడెం ఆదివాసీ విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 23వ తేదీ బుధవారం అన్ని ప్రజా, గిరిజన, రాజకీయ ప్రజా ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. పెద్దల సలహా, సూచనలతో భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకుని లక్ష్య సాధనకు ముందడుగులు వేస్తామని చెప్పారు. ఈ సమావేశానికి ఏజెన్సీలో ఉన్న నిరుద్యోగ యువత పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సోడే సీతారాముడు, తొడం నాగరాజు, చిచ్చడి సుబ్బారావు, కారం నవీన్‌కుమార్, కుంజ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 16 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల వేదికగా ప్రతి నెలా నిర్వహించే మినీ జాబ్ మేళా కార్యక్రమ సేవలను నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి ప్రవీణ్ కోరారు. భీమడోలు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల వేదికగా కళాశాల ప్రధానాచార్యులు రవికుమార్, స్కిల్ హబ్ ఇన్‌ఛార్జి జె.రాము పర్యవేక్షణలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సిడాప్, జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నెలవారీ జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. బజాజ్, ఇన్నోవా, హెటిరో ల్యాబ్స్ సంస్థలకు చెందిన ప్రతినిధులు దరఖాస్తుదారులతో ముఖాముఖి నిర్వహించి ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈ జాబ్ మేళాకు సుమారు 220 మంది హాజరవుతారని సన్నాహాలు చేశారు. మేళాకు హాజరైన 72 మందిలో 16 మంది నిరుద్యోగ యువత ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి వార్షిక వేతనం కనీసంగా రూ.2.60 లక్షల వరకు ఉంటుందని, ఆ తరువాత ప్రతిభ ఆధారంగా వేతనాలు పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్ కో-ఆర్డినేటర్ సురేష్ పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాల ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

బాణసంచా దుకాణాలు ఏర్పాటుకు పట్టణంలోని ది నూజివీడు లారీ ఓనర్స్ అసోసియేషన్ గ్రౌండ్‌ను తహశీల్దార్ బి.వెంకటసుబ్బారావు అధికారుల బృందంతో కలిసి మంగళవారం పరిశీలించారు. త్వరలో జరుపుకోనున్న దీపావళి సందర్భంగా ఏర్పాటు చేయనున్న తాత్కాలిక బాణసంచా దుకాణాల సముదాయానికి వినియోగించే స్థలంగా పరిశీలించారు. ఆర్‌డిఒ ఎం.వాణి ఆదేశాల మేరకు పట్టణ సిఐ పి.సత్యశ్రీనివాస్, అగ్నిమాపక శాఖ అధికారి మత్తయ్య, సిబ్బంది బృందంతో కలిసి తహశీల్దార్ పరిశీలించారు. నీటి సదుపాయం, పార్కింగ్, స్థల విస్తీర్ణాలను పరిశీలించి ఆర్‌డిఒకు నివేదిక అందిస్తామని తహశీల్దార్ సుబ్బారావు తెలిపారు. షాపుల సంఖ్య పెరిగితే రెండు ప్రాంతాల్లో అనుమతినివ్వటం అసాధ్యమని, వేరే ప్రాంతానికి మొత్తం షాపులను బదలాయించే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

మంత్రి నాదెండ్ల మనోహర్‌కు పలువురు వినతులు

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరుకు విచ్చేసిన పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలెక్టరేట్ కాంపౌండ్‌లో కలిసి కాన్ ఫెడరేషన్ ఆఫ్ ఏలూరు డిస్ట్రిక్ట్ కన్జ్యూమర్ అసోసియేషన్స్ సభ్యుల ఆధ్వర్యంలో జిల్లా వినియోగదారుల సమస్యలపై వినతిపత్రం అందించినట్లు సెడ్కాస్ అధ్యక్షులు, న్యాయవాది కట్టా సత్యనారాయణ తెలిపారు. గత ఐదారు సంవత్సరాలుగా వినియోగదారుల సమస్యలు బాగా పెరిగాయని, జిల్లా కేంద్రంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు లేకపోవడంతో తనిఖీలు నిర్వహించడం లేదన్నారు. గ్రామ, మండల పట్టణ స్థాయిలో వినియోగదారులకు సరైన అవగాహన లేక కల్తీ వ్యాపారుల మోసాలకు ప్రజలు గురవుతున్నారన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులను నియమించాలని కోరారు. అలాగే లీగల్ మెట్రాలజీ ఆఫీసులో సిబ్బంది తక్కువ ఉండడంతో తనిఖీలు నిర్వహించడంలేదని, అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి రెగ్యులర్‌గా తనిఖీలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కె.రామచంద్రరావు, సహాయ కార్యదర్శి సిఎపిఎస్.రామానుజాచార్యులు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ కె.ప్రసాద్ పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి కృషి చేయాలి : ఎపి ఎన్‌జిఒస్

ఏలూరు అర్బన్ :ఉద్యోగులు జిల్లా అభివృద్ధికి అన్ని రకాలుగా సహకరించాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ కోరారు. ఏలూరు కలెక్టరేట్‌లో పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఎపి ఎన్‌జిఒస్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఏలూరు జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందిస్తూ కూటమి ప్రభుత్వం అన్ని రకాలుగా రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తుందని, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా ఏలూరు జిల్లాకు ఎక్కువ నిధులు కేటాయించి అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఉద్యోగులు జిల్లా అభివృద్ధికి సహకారాన్ని అందిచాలని ఎన్‌జిఒస్ నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏలూరు తాలూకా అధ్యక్షుడు జి.శ్రీధర్‌రాజు, కార్యదర్శి కె.సత్యనారాయణ, జిల్లా కోశాధికారి శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శి నరేంద్ర పాల్గొన్నారు.

బొర్రంపాలెంలో అక్రమాలపై మంత్రి నాదెండ్లకు ఫిర్యాదు

టి.నరసాపురం : మండలంలోని బొర్రంపాలెం పంచాయతీలో అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని మంత్రి నాదెండ్ల మనోహర్‌కి గ్రామానికి చెందిన సామాజిక వేత్త పాండురంగ మంగళవారం ఫిర్యాదు చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా ఏలూరులో పర్యటించిన ఆయనను పాండురంగ స్వయంగా కలిసి గ్రామ పంచాయతీలో జరిగిన అవినీతిని వివరించినట్లు తెలిపారు. మంత్రి మనోహర్ అన్ని విషయాలను విని, అవినీతిపరులపై ఉక్కుపాదం మోపుతానని మాట ఇచ్చారని తెలిపారు.

నాదెండ్లను కలిసిన జనసేన నాయకులు

కలిదిండి :రాష్ట్ర పౌరసరఫరాల శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ ఏలూరు జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా ద్వారకాతిరుమలలో ఆయనను మండలంలోని కోరుకొల్లు సర్పంచి, జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బట్టు లీలా కనక దుర్గామహేష్ మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. నాదెండ్ల మనోహర్‌ను కలిసినవారిలో జనసేన సెంట్రల్ ఆంధ్రా జోన్ కో-కన్వీనర్ నల్లగోపుల చలపతిరావు(నాని), చిరంజీవి యువత మండలాధ్యక్షులు జడ్డు సుబ్రహ్మణ్యం, కె.అంజిబాబు, పేపకాయల మౌళి, కొప్పర్తి షణ్ముఖ శ్రీనివాస్ ఉన్నారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - ఉంగుటూరు

చేబ్రోలు సబ్‌డివిజన్ పరిధిలో చేబ్రోలు (నారాయణపురం) విద్యుత్ సంస్థ కార్యాలయంలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక బుధవారం నిర్వహించనున్నారు. ఉంగుటూరు, నిడమర్రు మండలాల విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని సమస్యలకు పరిష్కారం పొందాలని గొల్లగూడెం ఎఇ వేణు కోరారు. ఈ సమావేశానికి సిజిఆర్ఎఫ్ ఛైర్మన్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు హాజరు కానున్నారని తెలిపారు.

మరమ్మతులకు గురైన మోటార్

ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా

ప్రజాశక్తి - ఉంగుటూరు

గోపీనాథపట్నం కాలనీలో తాగునీటి బోరు మోటారు మరమ్మతులకు గురైంది. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రామారావు పర్యవేక్షణలో బాగు చేయిస్తున్నారు. ఈ క్రమంలో కాలనీ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా సంచార ట్యాంకు ద్వారా ఇంటింటా నీటిని మంగళవారం అందించామని సర్పంచి పుత్సకాయల విష్ణుమూర్తి చెప్పారు. కార్యదర్శి కనకదుర్గ, సచివాలయం ఉద్యోగులు, పాలక సభ్యులు పాల్గొన్నారు.

చేతి వృత్తిదారులకు నిధులు కేటాయించాలని వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలవుతున్నా చేతి వృత్తిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టలేదని చేతి వృత్తిదారుల సమైక్య రాష్ట్ర అధ్యక్షులు కడుపు కన్నయ్య ఆవేదన వ్యక్తం చేశారు. చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర పిలుపులో భాగంగా చేతి వృత్తిదారుల సమైక్య ఏలూరు జిల్లా సమితి నాయకులు బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్.పుష్పలతకు మంగళవారం వినతిపత్రం అందించారు. రాష్ట్ర జనాభాలో 30 శాతం వరకు ఉన్న చేతి వృత్తిదారులకు రాష్ట్ర బడ్జెట్‌లో 25 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందించిన వారిలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు బల్ల కనకదుర్గారావు పాల్గొన్నారు.

జిపిఎఫ్ ఖాతాలు తెరవాలని వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నగరపాలక సంస్థలో వివిధ ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న సుమారు 70 మంది ఉపాధ్యాయులకు సత్వరమే జిపిఎఫ్ ఖాతాలు తెరవాలని కోరుతూ మంగళవారం ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో ఏలూరు ఎంఇఒ-1కు వినతిపత్రం అందించారు. నగర పాలక సంస్థలోని ప్రాథమిక ఉన్నత, ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ పోస్టుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నగర శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కురమా ఆనందకుమార్, ప్రధాన కార్యదర్శి అబ్బదాసరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ఎంవి.సుబ్బారావు పాల్గొన్నారు.

కైకరంలో అన్నసమారాధన

ప్రజాశక్తి - ఉంగుటూరు

కైకరం తూర్పువీధి అల్లు వారి రామాలయం వద్ద దసరా నవరాత్రులు పూర్తయిన సందర్భంగా మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిసర భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘం, రంగా యువసేన గౌరవ అధ్యక్షుడు వెజ్జు సుబ్బారావును ఆలయ కమిటీ వారు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, గణపవరం మండలం, గణపవరం గ్రామ కాపురస్తులైన యామ్ముల మార్తమ్మ, భర్త: విజయ్ కుమార్ అను నేను నా యొక్క పాస్‌పోర్టు గణపవరం SBI సెంటర్లో జిరాక్స్ తీయించుకొని మా ఇంటికి వచ్చే మార్గ మధ్యలో పాస్‌పోర్టు నెం. K2278960 గల పాస్‌పోర్టు మరియు జిరాక్స్‌తో సహా కవర్లో పెట్టుకొని మా ఇంటికి వచ్చే మార్గ మధ్యలో ఎక్కడ పడిపోయిందో తెలియదు. ఎంత వెతికిన దొరకలేదు. దొరికినవారు ఈక్రింది ఫోన్ నెంబరుకు తెలియజేయగలరు.

అడ్రస్: యామ్ముల మార్తమ్మ
భర్త: విజయ్ కుమార్
గణపవరం గ్రామం, గణపవరం మండలం
పశ్చిమగోదావరి జిల్లా
సెల్: 83415 18722

PUBLIC NOTICE

Under the instruction of my client M/S Shriram Finance Ltd. Aswaraopeta Branch Rep. by its Branch Manager it is stated that Bonthu Ravindra Babu, s/o Thathaiah, 37 years, R/o H.No. 1-27, Ambedkar veedhi, Near MRO Office, Jeelugumilli village and Mandal, Eluru District. AP, is creating mortgage against his property shown below as security for the proposed trade loan. If anybody having any objection, they can send the objections to me or to my client within 3 days from the date of publication of this notice and further objections if any shall not bind my client.

SHEDULE OF THE PROPERTY

Vacant house site to an extent of 269.63 Sq. yards or 225.45 Sq. Meters bearing plot no.3 bearing R.S.No. 406/2, R.S.No. 406/3 (vide approved layout L.P.No.3/2022/1142,dt. 08/05/2023) situated with in the Municipal limits of Jangareddigudem village and Mandal, Eluru District, SRO limits of Jangareddigudem bounded by:

EAST : Meters 11.44 Puntha Road
SOUTH : Meters 19.50 Plot no.4 place
WEST : Meters 11.58 Plot no.6 place
NORTH : Meters 19.80 Plot no.2 place

P.GANESH BABU
Advocate
Kothagudem
Kothagudem
Dt: 22-10-2024
Cell:98492 46278